
సాక్షి
కామారెడ్డి
సోమవారం। 19 । ఫిబ్రవరి । 2024



శనగను ఆశించిన వైరస్

జిల్లాలో శనగ పంటను వైరస్ ఆశించింది. దీంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో ▸



సా..గుతున్న గేట్ల మరమ్మతులు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లకు రెండేళ్లు గడుస్తున్నా.. మరమ్మతులు కొనసాగుతూనే ఉన్నాయి.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.6 /13.8

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు

కామారెడ్డి టౌన్: మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు కామారెడ్డి ఆర్టీసీ డిపో నుంచి 58 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఇందిర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీ వరకు బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాలకు బస్సులు తక్కువగా నడుస్తాయని, ప్రయాణికులు సంస్థకు సహకరించాలని కోరారు.

బాన్సువాడ నుంచి..

బాన్సువాడ: బాన్సువాడ ఆర్టీసీ డిపో నుంచి మేడారం జాతరకు 62 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు డిపో మేనేజర్ సరితాదేవి తెలిపారు. ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలి'

కామారెడ్డి క్రైం: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలని లీడ్ జిల్లా మేనేజర్ భార్గవ్ సుధీర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 'మేక్ ఏ రైట్ స్టార్ట్– బికమ్ ఫైనాన్షియల్లీ స్మార్ట్' పేరుతో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు, 'పొదుపు, చక్రవడ్డీ శక్తి'పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈనెల 19 నుంచి 23 వరకు మండల, జిల్లా స్థాయిలలో పోటీలు ఉంటాయని తెలిపారు. ఆయా బ్యాంకుల పరిధిలో ఈనెల 26 న ఆర్థిక అక్షరాస్యత పోస్టర్ల ఆవిష్కరణ, 27 న 2 కె రన్ , 28 న ఆర్థిక అక్షరాస్యత శిబిరం, 29 న అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో సమావేశమై ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యతపై ప్రసంగాలు, కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

నేడు యూత్ కాంగ్రెస్ జిల్లా స్థాయి సమావేశం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం యూత్ కాంగ్రెస్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇలియాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి జిల్లాలోని యూత్ కాంగ్రెస్ నాయకులందరు హాజరుకావాలని కోరారు.

డబ్ల్యూటీవో సమావేశాలకు ఆర్మూర్‌వాసికి ఆహ్వానం



మోర్తాడ్(బాల్కొండ): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లోని ఆబుదాబీలో ఈనెల 26నుంచి 29వ తేదీ వరకు ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో) 13వ మంత్రుల సమావేశం నిర్వహించనున్నారు. భారత్‌తో సహా 164 సభ్య దేశాల వాణిజ్య మంత్రులు, వివిధ రంగాల ఆర్థిక నిపుణులు ఈ సమావేశాలలో పాల్గొని నాలుగు రోజుల పాటు ప్రపంచ దేశాల మధ్య వాణిజ్య సహకారంలో ఎదురయ్యే సమస్యలపై చర్చించనున్నారు. ఇందులో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన దక్షిణ భారత రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు పాల్గొననున్నారు. భారత దేశంలోని ఎన్‌జీవో సంస్థల ప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులను సమావేశాలకు ఆహ్వానించారని కోటపాటి నర్సింహనాయుడు తెలిపారు. ఈనెల 24న అబుదాబీకి వెళ్తానని పేర్కొన్నారు.

నేటి నుంచి డిచ్‌పల్లి రామాలయ బ్రహ్మోత్సవాలు



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం సీతారామ చంద్రస్వామి సప్తాహిక ధ్వజారోహణ, తిరుకల్యాణోత్సవాలు సోమవారం నుంచి ఈ నెల 25 వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 8 గంటలకు ఆలయంలో పుణ్యాహవచనం, అంకురార్పణం, ముత్సంగ్రహణం, అఖండ దీపారాధన, రక్షాబంధనం, నివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సుమిత్ శర్మ దేశ్‌పాండే, ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్, సొసైటీ చైర్మన్ గజవాడ జైపాల్, తాజా మాజీ సర్పంచ్ గడ్డం రాధాకిష్టారెడ్డి తెలిపారు.



నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

ఆయకట్టుకు భరోసా

- నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లో పుష్కలంగా నీళ్లు
- యాసంగి పంటలకు ఇప్పటికే నాలుగు విడతల్లో నీటి విడుదల
- పంటలు గట్టెక్కాలంటే మరో నాలుగు టీఎంసీలు అవసరం
- ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 9.9 టీఎంసీల నీరు

నిజాంసాగర్(జుక్కల్) : ఆయకట్టు కింద యాసంగిలో సాగవుతున్న పంటలకు నిజాంసాగర్ ప్రాజెక్ట్ భరోసానిస్తోంది. జలాశయంలో పుష్కలంగా నీరు ఉండటంతో ఈ సీజన్‌లో పంటలకు ఢోకా లేదని రైతులు అంటున్నారు. ప్రాజెక్టు ఆయకట్టు కింద అలీసాగర్ రిజర్వాయర్, డిస్ట్రిబ్యూటరి 49 వరకు 1.15 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. మొదటి ఆయకట్టు ప్రాంతంతో పాటు అలీసాగర్ వరకు రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు విడతల వారీగా నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పంటలకు సకాలంలో నీరు అందుతోంది. ప్రాజెక్టు నుంచి ఇప్పటి వరకు ప్రధాన కాలువకు నాలుగు విడతల్లో ఆరు టీఎంసీల నీరు విడుదల చేశారు. ప్రధాన కాలువకు నీటిని విడుదల చేస్తుండటంతో డిస్ట్రిబ్యూటరీల వారిగా రైతులు పొలాలకు నీటిని మళ్లించుకుంటున్నారు.

మరో రెండు విడతలు అవసరం

నిజాంసాగర్ ఆయకట్టు కింద వరితో పాటు వేరుశనగ, సోయ, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు సాగు చేస్తున్నారు. ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదలు చేస్తుండటంతో ఆయా పంటలు పచ్చదనంతో కళకలాడుతున్నాయి. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు 15 రోజుల పాటు నీటిని విడుదల చేస్తున్నారు. తర్వాత 10 రోజుల పాటు బంద్ పాటిస్తున్నారు. దీంతో పంటల అవసరాల మేరకు రైతులు నీటిని పొదుపుగా వినియోగిస్తున్నారు. ప్రధాన కాలువ ద్వారా విడుదల అవుతున్న నీరు వృథా కాకుండా నీటి పారుదలశాఖ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఆయకట్టుకు ఇప్పటి వరకు నాలుగు విడతల్లో ఆరు టీఎంసీలు విడుదల చేశారు. ఈ సీజన్‌లో పంటలు చేతికందే వరకు మరో రెండు విడతల్లో నాలుగు టీఎంసీల నీరు అవసరం. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 9.9 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో పంటలకు ఢోకా లేదని రైతులు అంటున్నారు. పంటలకు ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు విడతల్లో విడుదల చేసిన నీటి వివరాలు

మొదటి విడత	22-11-2023 నుంచి 29-11-23 వరకు	0.437 టీఎంసీ
రెండో విడత	4-12-2023 నుంచి 01-01-24 వరకు	2.553 టీఎంసీలు
మూడో విడత	11-01-24 నుంచి 23-01-24 వరకు	1.412 టీఎంసీలు
నాలుగో విడత	01-02-24 నుంచి 11-02-24 వరకు	1.517 టీఎంసీలు



ప్రధాన కాలువ కింద సాగవుతున్న వరి

గురుకులంలో కీచకుడు!

- విద్యార్థితో పార్ట్‌టైం టీచర్ అసభ్య ప్రవర్తన
- గతంలో మహిళలతోనూ ఇదే తీరు..
- పట్టించుకోని అధికారులు



నిజాంసాగర్(జుక్కల్): సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఓ పార్ట్‌టైం టీచర్ విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వృత్తికి కళంకం తెస్తున్నాడు. సదరు ఉపాధ్యాయుడి చర్యలు ఒక్కటొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వివరాలిలా ఉన్నాయి.

అచ్చంపేట గ్రామంలోని ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 524 మంది విద్యార్థులున్నారు. గురుకులంలో పార్ట్ టైం టీచర్‌గా పని చేస్తున్న ఓ వ్యక్తి తరచూ విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈనెల 13వ తేదీన రాత్రి వేళలో మద్యం సేవించిన సదరు ఉపాధ్యాయుడు.. గురుకులానికి వచ్చి ఏడో తరగతి విద్యార్థితో సపర్యలు చేయించుకున్నాడు. అంతటితో ఆగకుండా అతడిని బాత్‌రూంలోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. పరుష పదజాలంతో దూషించాడు. ఈ విషయాన్ని ఆ విద్యార్థి మరుసటి రోజు గురుకుల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకువెళ్లాడు. దీంతో విద్యార్థితో అసభ్యంగా ప్రవర్తించిన సదరు పార్ట్‌టైం టీచర్‌ను ఇంటికి పంపించి చేతులు దులుపుకున్నారు. కాగా సదరు కీచక టీచర్ ఇటీవల ఓ మహిళతోనూ అసభ్యంగా ప్రవర్తించగా.. ఆమెకు సర్ది చెప్పినట్లు తెలుస్తోంది.

ఉపాధ్యాయులపైనా ఆరోపణలు..

గురుకులంలో పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తెలిసింది. పాఠశాల సమయం ముగిసిన తర్వాత విద్యార్థులతో మద్యం తెప్పించుకుని గురుకులం పరిసరాల్లోనే సేవిస్తున్నట్లు సమాచారం. విద్యార్థితో పార్ట్ టైం టీచర్ అసభ్య ప్రవర్తన విషయమై అచ్చంపేట గ్రామస్తులు ఆగ్రహంతో ఉన్నారు. వారు ఈ విషయమై గురుకుల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఉన్నతాధికారులు స్పందించి గురుకుల పాఠశాలపై దృష్టి సారించాలని, కట్టు తప్పుతున్న గురువులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహారాష్ట్రకు ఆర్టీసీ బస్సుల నిలిపివేత

బోధన్: మహారాష్ట్రలో బీసీ రిజర్వేషన్ కోసం మరాఠీలు చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తంగా మారిన పరిస్థితుల్లో బోధన్ నుంచి ఆర్టీసీ సర్వీసులు నిలిపివేశారు. రెండు రోజులుగా బస్సులను ఆపేశారు. బోధన్ డిపో నుంచి మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా పరిధిలోని దెగ్లూర్, ధర్మాబాద్‌లతో పాటు నాందేడ్ జిల్లా కేంద్రానికి నిత్యం ఆర్టీసీ బస్సుల నడుపుతున్నారు. ఇరు రాష్ట్రాల నుంచి రోజూ వందల మంది ప్రయాణికుల రాకపోకలు సాగుతుంటాయి. అలాగే మహారాష్ట్ర ప్రాంతంలోని ముఖ్య నగరాల నుంచి తెలంగాణలోని నిజామాబాద్, హైదరాబాద్‌లకు నడుపుతున్న అక్కడి ఆర్టీసీ సర్వీసులను కూడా రద్దు చేశారు. దీంతో ఇరురాష్ట్రాల సరిహద్దు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



బోధన్ ఆర్టీసీ డిపో ముఖచిత్రం

బీసీ గురుకులాలకు మోక్షం..!

- బడ్జెట్‌లో రూ. 1,546 కోట్ల కేటాయింపు
- సొంత భవనాలు నిర్మిస్తే.. విద్యార్థులకు తీరనున్న ఇక్కట్లు

మోర్తాడ్(బాల్కొండ): మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందు కోసం 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీ గురుకుల పాఠశాలలకు రూ. 1,546 కోట్ల నిధులను కేటాయించింది. జిల్లా లో నియోజకవర్గానికి ఒక బాలుర, బాలికల గురు కుల పాఠశాలలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2017–18లో మంజూరు చేసింది. మొదట్లో పదో తరగతి వరకే విద్యాబోధన అందించినా దశల వారీగా ఇంటర్‌ను ప్రవేశపెట్టారు. మోర్తాడ్, కుద్వాన్‌పూర్(ఆర్మూర్), ఆర్మూర్, బాల్కొండ, చీమన్‌పల్లి, ఎడపల్లి, నిజామాబాద్, బోధన్‌లలో బీసీ గురుకుల పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఐదు నియోజకవర్గాల్లోని పది గురుకులాలు అద్దె భవనాలు లేదా అరకొర వసతులు ఉన్న ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. ఎక్కడ కూడా గురుకుల పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించలేదు. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా భవనాల నిర్మాణానికి నిధులను మంజూరు చేయలేదు. ప్రతి పాఠశాలకు కనీసం ఐదెకరాల స్థలం అవసరమని బీసీ గురుకుల పాఠశాలల యాజమాన్యం నిర్ధారించింది. ప్రతి పాఠశాలలో 400ల నుంచి 500ల మంది విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నారు. సొంత భవనాలు అందుబాటులోకి వస్తే ఇంటర్, డిగ్రీ కూడా అమలు చేసే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో సొంత భవనాల నిర్మాణం కోసం స్థలం సేకరించి త్వరలోనే భవనాల నిర్మాణానికి పునాది రాయి వేసే అవకాశం ఉంది.



మోర్తాడ్‌లో తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న బీసీ గురుకుల పాఠశాల

మండలానికో తెలంగాణ పబ్లిక్ స్కూల్

- బడ్జెట్‌లో ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం
- రూ. 500 కోట్ల కేటాయింపు
- అధునాతన సౌకర్యాలతో నిర్మాణానికి చర్యలు

మోర్తాడ్(బాల్కొండ): అధునాతన సౌకర్యాలతో మండలానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గత నెల 11న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ కోసం రూ. 500 కోట్లను కేటాయించారు. ఇప్పటికే మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలను మండలానికి ఒకటి చొప్పున కొనసాగిస్తున్నారు. మోడల్ స్కూల్స్ విషయంలో కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే వీటిని నిర్వహిస్తుండగా మండలానికి ఒక పాఠశాల ఏర్పాటు చేయలేకపోయింది. మోడల్ స్కూల్స్‌లో సీబీఎస్సీ సిలబస్‌తోనే విద్యా బోధన కొనసాగుతోంది. కస్తూర్బా పాఠశాలల్లో మాత్రం రాష్ట్ర సిలబస్ అమలు చేస్తున్నారు. కస్తూర్బా పాఠశాలలు పూర్తిగా బాలికల కోసం నిర్వహిస్తుండగా మోడల్ స్కూల్స్‌లో మాత్రం కో-ఎడ్యుకేషన్ అమలవుతోంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏ విధంగా ఉండబోనున్నాయనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. పైలెట్ ప్రాతిపదికన అని ప్రభుత్వం వెల్లడించడంతో ఏ జిల్లాకు ఎన్ని పాఠశాలలు ఏర్పాటు చేస్తారనే వివరాలు కూడా తెలియాల్సి ఉంది. ఇప్పటికే బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాలల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కొన్ని చోట్ల విద్యార్థులు లేక పాఠశాలలు మూతబడే స్థితికి చేరుకున్నాయి. ఇలాంటి తరుణంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధి విధానాలు ఎలా ఉండబోతున్నాయి.. ఎన్ని తరగతులకు విద్యా బోధన అందిస్తారు, గురుకుల విధానం అమలు చేస్తారా అనే విషయంలో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేస్తేనే పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది. ఏది ఏమైనా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ విషయంలో అంతటా ఆసక్తికర చర్చ సాగుతుందని చెప్పవచ్చు.

క్రీడలతో పాటు చదువుపై శ్రద్ధ చూపాలి

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



భిక్కనూరు : విద్యార్థులు చిన్నతనం నుంచి క్రీడలతో పాటు చదువుపై కూడా శ్రద్ధ చూపాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. ఆదివారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంలో జూనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు కైరంకొండ శరత్‌చంద్రను ఆయన అభినందించారు. శరత్ చంద్ర ఫుట్‌బాల్ క్రీడలో మరింత ప్రతిభ చూపేందుకు అవసరమైన శిక్షణకు తాను సహకరిస్తానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భీంరెడ్డి, నాయకులు శ్రీనివాస్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

'అమ్ముల పొది' పుస్తకావిష్కరణ



కామారెడ్డిలోని కర్షక్ బీఈడీ కళాశాలలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు మల్లారెడ్డి, తదితరులు

కామారెడ్డి అర్బన్ : నిజాలను నిర్భయంగా చెప్పే సత్తా కవులు, రచయితలకే ఉంటుందని తెలంగాణ రచయితల వేదిక(తెరవే) రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి అన్నారు. ఆదివారం తెరవే ఆధ్వర్యంలో పట్టణంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో ప్రముఖ కవి, రచయిత అల్లి మోహన్‌రాజ్ రాసిన 'అమ్ముల పొది' కవితా సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సభకు తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్‌కు అధ్యక్షత వహించగా, రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కవులు నిరంతరం అధ్యయనం చేస్తూ రచనను కొనసాగించాలన్నారు. ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు డాక్టర్ నర్ల రామకృష్ణారెడ్డి, గజల్ కవి సూరారం శంకర్, తెరవే బాధ్యులు వైగంగాప్రసాద్, మంద పీతాంబర్, నాగభూషణం, కాసర్ల రామచంద్రం, సుప్పని సత్యనారాయణ, సిరిగాద శంకర్, రుద్రంగి రమేష్, ఎంబరి లింగం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ఏది?

- పీఎంకేఎంవై కింద 60 ఏళ్లు దాటిన రైతులకు రూ.3 వేల పింఛన్
- పథకంపై అవగాహన కల్పించని అధికారులు

బాన్సువాడ : రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే రైతులకు చేదోడుగా ఉండేందుకు పింఛన్ అందించాలని కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం ప్రధాన మంత్రి కిసాన్ మన్‌ధన్ యోజన పథకం(పీఎంకేఎంవై) ప్రారంభించింది. ఈ పథకంతో 60 ఏళ్లు దాటిన వారికి ప్రతి నెలా రూ.3 వేల పింఛన్ అందుతోంది. వయస్సు ఆధారంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. దీనికోసం రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వ్యవసాయ అధికారులు 2021లో మాత్రం మొక్కుబడిగా రైతులకు అవగాహన కల్పించారు. రెండేళ్లుగా ఈ పథకంపై అవగాహన కల్పించడం లేదు. దీంతో చాలా మంది రైతులు నష్టపోతున్నారు. ఎంత మంది రైతులు అర్హులు, ఎంత మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారో కూడా వ్యవసాయ శాఖ అధికారుల వద్ద రికార్డులు లేకపోవడం గమనార్హం.

రూ.55తో ప్రారంభం

ప్రధానమంత్రి కిసాన్ మాన్ ధన్ యోజన పథకంలో చేరిన రైతులు నెలకు రూ.55 నుంచి కడుతూ రావాలి. గరిష్ఠంగా రూ.200 వరకు కట్టాల్సి రావొచ్చు. ఏ వయసులో పథకంలో చేరారనే అంశం ప్రాతిపాదికన చెల్లించాల్సిన మొత్తం ఆధారపడి ఉంటుంది. 18 ఏళ్లలోనే స్కీమ్‌లో చేరితే నెలకు రూ.55 కడితే సరిపోతుంది. అదే 40 ఏళ్ల వయసులో చేరితే నెలకు రూ.200 చెల్లించాలి. 60 ఏళ్లు దాటిన తర్వాత ప్రతీ నెలా రూ.మూడు వేలు వస్తాయి. నేరుగా బ్యాంక్ అకౌంట్‌లోనే డబ్బులు జమవుతాయి. చిన్న, సన్నకారు రైతులకు సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకువచ్చారు.



వీరు అనర్హులు..

- చిన్న, సన్నకారు రైతులు అయినా.. చట్టబద్ధమైన సామాజిక భద్రత పథకాల్లో ఉన్న వారు ఈ పథకానికి అనర్హులు. రాష్ట్ర ఉద్యోగ బీమా పథకం, ఎంప్లాయిమెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ స్కీంలో ఉన్నవారు.
- ప్రధానమంత్రి శ్రయోగి మన్‌ధన్ యోజనలో ఉన్న రైతులు, సంస్థాగత భూముల కల్గిన వారు.
- రైతు కుటుంబంలో ఎవరైనా గతంలో లేదా ప్రస్తుతం రాజ్యాంగ పదవిలో ఉన్నవారు.
- కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులు, విరమణ పొందిన ఉద్యోగులు.
- రూ.10 వేల పైన పింఛన్ పొందుతున్న వారు, ఆదాయ పన్ను చెల్లించే వారు అనర్హులు.

క్లుప్తంగా

శివాజీ జయంతికి సెలవు ప్రకటించాలి



నిజామాబాద్ సిటీ: శివాజీ మహరాజ్ జయంతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు దినంగా ప్రకటించాలని ఆరె క్షత్రీయ సమాజ్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా యువజన విభాగం వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మణ్ రావు ఆదివారం కోరారు. ఆరె క్షత్రీయ వంశస్తుడు, అఖండ భారత గుండె చప్పుడు, వీరాధివీరుడు శివాజీ మహరాజ్ అని అన్నారు. ఫిబ్రవరి 19న నిర్వహిస్తున్న శివాజీ జయంతిని కేంద్ర ప్రభుత్వం జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. 27 ఏళ్ల పాటు యుద్ధాలలో గడిపి హిందూ రాజులకు ఆదర్శంగా నిలిచి సువిశాల మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన గొప్పవీరుడు శివాజీ అని పేర్కొన్నారు. శివాజీ జయంతి వేడుకలను హిందూ యువత ఘనంగా నిర్వహించాలని కోరారు.

జోరందుకున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ జోరందుకుంది. శనివారం నాటికి 3,26,680 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు ఆదివారం తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రషింగ్ పూర్తయ్యే వరకు రైతులు సహకరించాలని కోరారు.

ఆలయ దుకాణాలకు బహిరంగ వేలం

మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్పూర్‌లో ఉన్న హనుమాన్ ఆలయ పరిసరాల్లోని పూజా సామగ్రి దుకాణాల నిర్వహణకు ఈ నెల 21న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ సిబ్బంది వేణు ఆదివారం తెలిపారు. దీనికి రెండేళ్ల కాల పరిమితి ఉంటుందని వేలంలో పాల్గొనే ఆశావహులు రూ. పది వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.

మోడల్ స్కూల్‌కు భారీగా దరఖాస్తులు



భానుమతి ప్రిన్సిపాల్

సదాశివనగర్ (ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రవేశం పొందేందుకు భారీగా దరఖాస్తులు వచ్చినట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. ఆరో తరగతికి అత్యధికంగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆరో తరగతిలో వంద సీట్లకు గాను 452 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఏడో తరగతిలో 120, 8వ తరగతిలో 80, తొమ్మిదో తరగతిలో 71, పదో తరగతిలో 30 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. ఆరో తరగతి తప్ప మిగిలిన తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను మాత్రమే భర్తీ చేయనున్న ట్లు పేర్కొన్నారు. ఈనెల 22తో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ముగియనుందన్నారు.

శనగను ఆశించిన వైరస్

- తగ్గిపోనున్న దిగుబడి
- నష్టపోతున్న రైతులు
- జిల్లాలో 17 వేల ఎకరాల్లో సాగవుతున్న పంట



కందకుర్తి శివారులో కోతకు వచ్చిన శనగ పంట

రెంజల్: శనగ పంటకు వైరస్ ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు మూడేళ్లుగా జిల్లాలో శనగా పంట వేసిన రైతులు నష్టపోతూనే ఉన్నారు. పంటకు వైరస్ ఆశించి దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఎకరాకు 8 నుండి 10 క్వింటాళ్ల వరకు రావాల్సిన దిగుబడులు సగానికి పడిపోయి మూడు, నాలుగు క్వింటాళ్లకు మించడం లేదని శనగ రైతులు వాపోతున్నారు. ప్రతి యాసంగిలో జిల్లాలోని రెంజల్, బోధన్, కోటగిరి మండలాల్లో అత్యధికంగా శనగ సాగు చేస్తారు. ఈ సీజన్‌లో సుమారు 17 వేల ఎకరాల్లో రైతులు శనగ పంగను సాగు చేస్తున్నారు.

ఆశించిన ధర ఉన్నా..

శనగ పంటకు మార్కెట్‌లో ఆశించిన ధర లభిస్తున్నా దిగుబడులు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రూ.5,450 మద్దతు ధర అందిస్తుండగా ప్రస్తుతం మార్కెట్‌లో రూ.5,800 నుంచి రూ.ఆరు వేల వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పంట దిగుబడులు లేకపోవడంతో వ్యాపారులు అధిక ధర చెల్లిస్తు కొనుగోలు చేస్తున్నారు.

పంట మార్పిడి లేక వైరస్ వ్యాప్తి

సాగు నీటి సౌకర్యం లేని రైతులు ప్రధానంగా శనగను సాగు చేస్తారు. దశాబ్దాల తరబడి పంటల మార్పిడి లేక మూసా పద్ధతిలో శనగను సాగుచేయడంతో వైరస్ వ్యాప్తి చెంది దిగుబడులు ఏటేటా పడిపోతున్నాయి. రెండు, మూడేళ్లుగా రైతులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

పలువురు రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. కొంత కాలం శనగ పంటకు విరామం ప్రకటించాలని రైతులు ఆలోచిస్తున్నారు. వైరస్‌కు తోడు పంటకు చీడపీడలు, తెగుళ్ల సోకి కాత, పూత రావడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట ఉత్పత్తులు పడిపోవడంతో పెట్టుబడులు తప్ప లాభాలు దక్కడంలేదని పేర్కొంటున్నారు. కౌలు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

దిగుబడి రావడం లేదు



పదేళ్లుగా 15 ఎకరాల్లో శనగ పంటను సాగు చేస్తున్నా. రెండేళ్లుగా పంట దిగుబడి రావడంలేదు. పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఎకరాకు రూ.25 నుంచి రూ.30 వేల ఖర్చవుతుంది. మూడు, నాలుగు క్వింటాళ్లు వస్తే పెట్టుబడులకే సరిపోతున్నాయి. ఈ సంవత్సరం శనగను తగ్గించి పొగాకు విస్తీర్ణం పెంచాను.

– ఇమాం బేగ్, నీలా విండో చైర్మన్

అప్పులు మిగులుతున్నాయి



శనగ సాగు చేస్తే రెండేళ్లుగా అప్పులే మిగుతున్నాయి. మార్కెట్‌లో మంచి ధర ఇస్తున్నా దిగుబడులు తగ్గడంతో నష్టాలు వస్తున్నాయి. కాత, పూత వస్తున్నా గింజలు రంగు మారి గట్టి పడడంలేదు. రెండు తడుల నీళ్లు అందించిన ఫలితం రావడంలేదు. దిగుబడి అంతంతే రావడంతో నష్టం వస్తుంది. కౌలు రైతులను ఆదుకోవాలి.

– సర్వరాజ్‌ఖాన్, కౌలు రైతు, కందకుర్తి

సీఎంను కలిసిన మానాల



ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో సీనియర్ నాయకులు సమన్వయం చేసుకుంటూ జిల్లాలో పార్టీ శ్రేణులను ముందుకు తీసుకెళ్లాలని సీఎం మానాలకు సూచించారు. మానాలతో పాటు ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ ఉన్నారు.



వేణురాజ్‌ను సీఎంకు పరిచయం చేస్తున్న మానాల

అ'పూర్వ'సమ్మేళనం



ఉత్తునూర్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సదాశివనగర్: మండలంలోని ఉత్తునూర్ ఉన్నత పాఠశాలలో 2003–04 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి గురువులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1995–96 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయులతో పాటు ప్రస్తుతం పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజశేఖర్, రాజాగౌడ్, సాయిలు, కృష్ణ, శ్రీధర్‌రెడ్డి, రఘువీర్, అర్వింద్ తదితరులు ఉన్నారు.



మహమ్మద్‌నగర్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సా..గుతున్న గేట్ల మరమ్మతులు

- రెండేళ్లు కావస్తున్నా పూర్తికాని పనులు
- ఇప్పటి వరకు 26 గేట్లు పూర్తి.. పెండింగ్‌లో 16..



గేట్ల రోప్‌ను సిద్ధం చేస్తున్న కార్మికులు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరద గేట్ల మరమ్మతులు కొనసాగుతున్నాయి. రెండేళ్ల క్రితం వరద గేట్ల మరమ్మతుల కోసం గత ప్రభుత్వం రూ. 17.5 కోట్ల నిధులను మంజూరు చేయగా 2022 మే నుంచి పనులు చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం 42 వరద గేట్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 26 వరద గేట్ల మరమ్మతు పనులు పూర్తి కాగా ఇంకా 16 పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం నీటి మట్టం తగ్గింది. దీంతో వరద గేట్ల మరమ్మతులు చేపట్టడానికి అనువుగా ఉంటుంది. కానీ పనుల్లో వేగవంతం కావడం లేదు. ఖరీఫ్ సీజన్‌లో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉన్నా అధికారులు స్టాప్ లాక్ గేట్లు వేస్తూ పనులు సాగించారు. ప్రస్తుతం పనులు నత్తక నడకనా కొనసాగుతుండడంతపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణ కాలం నుంచి..

ప్రాజెక్ట్ మిగులు జలాలను గోదావరిలోకి వదిలేందుకు ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలో 42 వరద గేట్లను నిర్మించారు. కానీ వరద గేట్లకు ప్రతి ఏడాది నిర్వహణ చేపట్టాలి. కానీ ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయకపోవడంతో మరమ్మతులను గాలి కొదిలేశారు. దీంతో వరద గేట్ల రోప్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఎగువ ప్రాంతాల నుంచి వరద భారీగా వచ్చినప్పుడు గేట్లు ఎత్తితే లేవకుండా, దిగితే దిగకుండా ఉండిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గేట్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఖరీఫ్ నాటికి పూర్తి చేస్తాం

వరదగేట్ల మరమ్మతులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించాం. ఇప్పటి వరకు 26 వరద గేట్లు మరమ్మతు పనులు పూర్తయ్యాయి. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి మరమ్మతులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

మట్టి స్నానాలతో ఆరోగ్యం పదిలం



యోగా అసోసియేషన్ సభ్యులు

కామారెడ్డి అర్బన్: మట్టి స్నానాలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యోగా రాంరెడ్డి అన్నారు. కామారెడ్డిలోని పెద్ద చెరువు వద్ద యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 'మట్‌బాత్' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాంరెడ్డి, ప్రకృతి వైద్యుడు గుండెల దేవయ్య, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పంచభూతాల్లో ఒకటైన మట్టితో మనిషికి విడదీయరాని బంధం ఉందని, మట్టిలో అనేక ఔషద గుణాలున్నాయని అన్నారు. ప్రకృతి ఔషదాలు కలిపిన మట్టిని శరీరానికి పట్టించి గంటసేపు ఎండలో ఉండి స్నానం చేస్తే శరీరంలోని అతి సూక్ష్మస్వేద రంధ్రాలు తెరుచుకొని ఆరోగ్యంగా ఉంటామని, చర్మవ్యాధులు సైతం దూరమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పెట్టిగాడి అంజయ్య, బాస రఘుకుమార్, లక్ష్మీపతియాదవ్, సిద్ధాగౌడ్, ఈశ్వర్, సత్యనారాయణ, కె రామచంద్రం, గురుచరణ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా మారిన రోడ్డు

నిజామాబాద్ జిల్లా చేంగల్ నుంచి భీమ్‌గల్, న్యావనందికి వెళ్లే దారి ప్రమాదకరంగా మారింది. గతంలో కురిసిన వర్షానికి రోడ్డు సగభాగం కుంగిపోయింది. దీంతో ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటేనే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

క్రైం కార్నర్

డీసీఎంలలో డీజిల్ చోరీ

లింగంపేట: మండల సమీపంలోని రెండు డీసీఎంల నుంచి దుండగులు శనివారం రాత్రి డీజిల్ చోరీ చేశారు. వాహనాల నుంచి సుమారు 400 లీటర్ల డీజిల్‌ను చోరీకి గురైనట్లు వాహనాల యజమాని సంతోష్ తెలిపారు.

నిజాంసాగర్‌లో కాపర్‌వైర్..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తాలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు శనివారం రాత్రి ధ్వంసం చేశారు. మస్కురి గణేశ్ వ్యవసాయ పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి ఆయిల్, కాపర్‌వైర్లను ఎత్తుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్న దుండగులపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: కోటగిరి పీఎస్ పరిధిలోని పొతంగల్ శివారు నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శనివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ ఆదివారం తెలిపారు. ట్రాక్టర్లను పీఎస్‌కు తరలించి డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జీపీ అనుమతి తీసుకోవాలి

రెంజల్(బోధన్): జెండాను ఆవిష్కరించేందుకు గ్రామ పంచాయతీ అనుమతి తీసుకోవాలని బోధన్ రూరల్ సీఐ నరేష్ సూచించారు. నీలా గ్రామంలో ఓ వర్గం వారు నిర్మించిన దిమ్మెకు రంగులు వేసి జెండాను ఎగుర వేసేందుకు ప్రయత్నించగా మరో వర్గం వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ నరేష్ గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు. జీపీ అనుమతి తీసుకోవాలని యువకులకు సూచించారు. అనంతరం ఇరు వర్గాలు బోధన్‌లోని ఏసీపీ కార్యాలయానికి చేరుకుని పరిస్థితి వివరించగా.. సంయమనం పాటించాలని ఏసీపీ శ్రీనివాస్ వారికి వివరించారు.

వెంచర్‌లో యువకుడి దారుణ హత్య

- బండరాయితో మోది చంపిన వైనం
- విచారణ చేపడుతున్న పోలీసులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని న్యాల్‌కల్ రోడ్డులో ఉన్న స్మార్ట్ సిటీ వెంచర్‌లో ఓ యువకుడు దారుణ హత్యకు గురైనట్లు ఐదవ టౌన్ ఎస్సై అప్పారావు ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. సీతారాంనగర్ కాలనీకి చెందిన శ్రావణ్‌కుమార్(35) ఖలీల్‌వాడిలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. వెంచర్‌లో ఉదయం మృతదేహం ఉందన్న సమాచారం అందడంతో ఏసీపీ రాజావెంకటరెడ్డి, రూరల్ సీఐ సతీశ్‌తో కలిసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. విచారణలో మృతదేహం శ్రావణ్‌కుమార్‌గా గుర్తించినట్లు చెప్పారు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఎవరైనా హత్య చేశారనే అనే కోణంలో విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్సు ఢీకొని ఒకరి మృతి

ఖలీల్‌వాడి: బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందినట్లు నాలుగవ టౌన్ ఎస్సై సంజీవ్ ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని నాగారంకు చెందిన క్యాసరపు నాగరాజు(57) జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. పులాంగ్ నుంచి నాగారంకు బైక్‌పై వెళ్తుండగా గాయత్రీనగర్ సమీపంలో ఎదురుగా వస్తున్న ప్రైవేట్ బస్సు ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెట్టును ఢీకొని మరొకరు..

డిచ్‌పల్లి: బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన గడ్డం లింబాద్రి(55) మండలంలోని ముల్లంగి(బి)కి పని నిమిత్తం వచ్చి తిరిగి వెళ్తుండగా ముల్లంగి సమీపంలో బైకు అదుపుతప్పి చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ లింబాద్రి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాన్సువాడలో కిడ్నాప్ వదంతులు

బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని ఎర్రమనుకుచ్చలో శనివారం రాత్రి కుల్దీప్‌సింగ్ అనే బాలుడి కిడ్నాప్ యత్నం జరిగినట్లు పట్టణంలో వార్త దావనంలా వ్యాపించింది. ఆటోలో వచ్చిన ఓ మహిళ తన చేతులు పట్టుకుని లాక్కెళ్లే ప్రయత్నం చేసినట్లు సదరు బాలుడు పేర్కొనడంతో నమ్మిన కాలనీవాసులు మహిళను వెంబడించి పట్టుకుని చితకబాదారు. పోలీసులకు సమాచారం అందడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని మహిళను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మహిళ నాందేడ్ నుంచి బాన్సువాడకు తన ప్రియుడి కోసం వచ్చినట్లు సీఐ కృష్ణ తెలిపారు. ఎక్కడైనా అపరితచ వ్యక్తులు కనిపిస్తే దాడి చేయకుండా పోలీసులకు అప్పగించాలని సీఐ సూచించారు.

మరో ఘటనలో సిద్దిపేట ప్రేమజంట

సిద్దిపేట్‌కు చెందిన ప్రేమజంట మండలంలోని రాజారాం దుబ్బకు ఆదివారం రావడంతో వారు కిడ్నాపర్లేనని భావించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పీఎస్‌కు తరలించి విచారణ చేపట్టారు. ఇంట్లో పెద్దలకు తెలియకుండా పెళ్లి చేసుకునేందుకు బాన్సువాడకు వచ్చినట్లు తెలిపారు. దీంతో ఇరుకుటుంబాల వివరాలు తెలుసుకొని తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇప్పించి పంపించినట్లు పేర్కొన్నారు.



కృష్ణ, సీఐ బాన్సువాడ

గాడిద పాలకు భలే డిమాండ్

- లీటరు రూ. 1,600 నుంచి రూ. 2 వేలు
- పిల్లల దగ్గు, ఆయాసానికి వినియోగిస్తున్న జనం



గాడిద పాలను విక్రయిస్తున్న మహిళ

భిక్కనూరు: గంగి గోవుపాలు గరిటెడైనను చాలు.. కడివడైననేమి ఖరము పాలు.. ఇది ఒకప్పుడు అందరూ చదువుకున్న పద్యపాదం. ఆవు పాల ముందర గాడిద పాలు ఎందుకూ పనికిరావని దీని అర్థం. అయితే పరిస్థితి మారిపోయింది. గాడిద పాలకే ఎక్కువ డిమాండ్ వచ్చింది. పిల్లల దగ్గు, ఆయాసం తగ్గడానికి వీటిని వినియోగిస్తుండడంతో లీటరు పాలు రూ. 1600 నుంచి రూ. 2 వేల వరకు పలుకుతోంది. పది మిల్లీలీటర్ల పాలు పిల్లలకు తాపితే దగ్గు, ఆయాసం, ఆకలి లేకపోవడం వంటి వ్యాధులు నయమవుతాయని గ్రామ ప్రజల నమ్మకం. దీంతో 25 ఎంఎల్ పాలు రూ. 40 నుంచి రూ. 60 వరకు పలుకుతోంది. రెండు రోజులుగా మండల కేంద్రంలో గాడిద పాల వ్యాపారులు తిరుగుతూ పాల వ్యాపారం చేస్తున్నారు. వారు అమ్మే ధరను చూస్తే లీటరు గాడిద పాలు రూ. 2 వేల వరకు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా కామారెడ్డిలో నివాసం ఉంటూ మండల కేంద్రాల్లో గాడిద పాల వ్యాపారం చేస్తున్న రాధను 'సాక్షి' పలుకరించగా గ్రామాల్లో తిరుగుతూ పాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. గాడిద పాలు చిన్నపిల్లలకు తాగిపిస్తే ఎంతో ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. తనకున్న గాడిదల పాల వ్యాపారం ద్వారా రోజుకు రూ. వెయ్యి వరకు సంపాదిస్తున్నట్లు పేర్కొన్నారు.